

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : ఎంఎల్ఎ

భీమవరం రూరల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత రూ.39 లక్షలతో ఏడో వార్డు మారుతీనగర్‌లోని వెంకటగణపతి నిలయం నుండి శ్రీనివాస నిలయం వరకూ నిర్మించే సీసీ డ్రెయిన్, బిటి రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.36.30 లక్షలతో ఇదే వార్డులోని మారుతీనగర్ పార్కు దక్షిణం వైపు ప్లాట్ నెంబర్ 305 వరకు నిర్మించే సీసీ డ్రెయిన్, బిటి రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం జంక్షన్ నుండి యనమదుర్రు డ్రెయిన్ బండ్ వరకు రూ.32 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును గ్రంధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో భీమవరం పట్టణాన్ని రూ.కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంఇ త్రినాధరావు, నేతలు పాల్గొన్నారు.

ముసురు ముప్పు..!


పాలకోడేరులో నేలకొరిగిన వరిచేలను కట్టలు కడుతున్న రైతు

రైతులను వెంటాడుతున్న వర్ష భయం
మొన్నటి వరకు సాగునీటి ఎద్దడి.. ప్రస్తుతం వర్షాలతో సతమతం
దిగుబడులపై తీవ్ర ప్రభావం
వాతావరణ మార్పులతో రైతులు కుదేలు

ప్రజాశక్తి - భీమవరం

వాతావరణ మార్పులతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మొన్నటి వరకు సాగునీటి ఎద్దడి వెంటాడితే ప్రస్తుతం అల్పపీడనంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ మార్పులు దిగుబడులపై పెను ప్రభావం చూపించడంతోపాటు మాసూళ్లు ఖర్చు పెరుగుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. వర్ష భయం రైతాంగానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రైతులు సార్వాలోనూ సాగునీటి కష్టాలను ఎదుర్కొన్నారు. అనంతరం తెగుళ్ల విజృంభణ, ఎలుకల బెడదను దాటుకుని పంటను గట్టుకు చేర్చే పనిలో రైతులు ప్రస్తుతం నిమగ్నమయ్యారు. వరిచేలు ప్రస్తుతం మాసుళ్ల ప్రక్రియలో ఎక్కువ శాతం ఉన్నాయి. అయితే వాతావరణంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా వాతావరణంలో మార్పులొచ్చాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మబ్బులతో నిండి చిరుజల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండించిన పంటను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యాన్ని చిరుజల్లుల కారణంగా రహదారులు, గట్లపైకి చేర్చలేని పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల కోసిన ధాన్యాన్ని వాతావరణ మార్పుల కారణంగా ఆరబెట్టలేక రైతులు అనేక పాట్లు పడుతున్నారు.

వెంటాడుతున్న వర్ష భయం

అల్పపీడనం ఏర్పడటంతో రైతులను వర్ష భయం వెంటాడుతోంది. గాలులు, చిరుజల్లుల కారణంగా చేతికొచ్చిన సార్వా పంట నెమ్మదిగా నేల వాలుతోంది. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో సార్వా సీజన్‌లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా 50 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. దీనిలో సుమారు 30 వేల ఎకరాల్లో మాసుళ్ల ప్రక్రియ పూర్తయ్యింది. 4.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా తీసుకోగా ఇప్పటివరకు 14,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం తదితర మండలాల్లో అధిక శాతంలో వరి కోతలు పూర్తయ్యాయి. తణుకు, ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, ఇరగవరం, పాలకోడేరు మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఆయా మండలాల్లో కోసిన వరి పంటకు ఎండ తగలక తేమశాతం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది. మబ్బుల కారణంగా ఒకటికి రెండు రోజులు అదనంగా ధాన్యాన్ని ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.

మొన్నటి వరకు అష్టకష్టాలు

మొన్నటి వరకు సాగునీటి ఎద్దడితో రైతులు సతమతమయ్యారు. శివారు పొలాలకు సాగు నీరు అందకపోవడంతో పొలాలు బీటలు వారిన పరిస్థితి ఉంది. దీంతో రైతులు సాగునీటి కోసం అనేక కష్టాలు పడ్డారు. ప్రత్యేకంగా ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకొని నీటిని తోడుకున్నారు. దీనికోసం అదనంగా రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. సాగులో ఎన్నో కష్టాలు పడ్డ రైతులకు మూడు రోజులుగా మారిన వాతావరణం గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై రైతులను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం వరిచేలు ఆశాజనకంగా ఉన్నాయి. దిగుబడులు కూడా ఆశించిన మేర కన్పిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 38 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. అయితే అతి కొద్దిరోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో అల్పపీడనం ఏర్పడటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే కొనసాగితే దిగుబడులపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ వాతావరణ మార్పులు ఇబ్బందికరంగా మారాయంటున్నారు.


మోగల్లులో వర్షం నీరు బయటికి తీసేందుకు వరి చేలో శేడులు తీసిన రైతులు

సమగ్ర కులగణన సర్వే అవగాహనతో చేయాలి : కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

సమగ్ర కుల గణన సర్వేను పూర్తి అవగాహనతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సమగ్ర కులగణన సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని సర్పంచులు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బందితో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులగణన అనేది కేవలం సర్వే మాత్రమే అని, సర్వే ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ, కులంను మార్పుగా నమోదు చేయడం, సంక్షేమ పథకాలకు వర్తింప చేయడం జరగదని స్పష్టం చేశారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అనే అంశాలపై ఈ నెల 27 నుండి డిసెంబర్ 10 వరకు జిల్లాలో కులగణన జరుగుతుందన్నారు. కులగణన సర్వే ఒక యాప్ ద్వారా మాస్టర్ డేటాతో సరి చూడడం ఉంటుందన్నారు. సర్వే చేసే సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పూర్తి అవగాహన కలిగి ప్రజలకు అనుమానాలను నివృత్తి చేసి త్వరితగతిన కచ్చితమైన కులగణన సర్వే నివేదికను రూపొందించాలని ఆదేశించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి పాల్గొన్నారు.


స్థల సేకరణ పత్రాన్ని జిల్లా ఫైర్ అధికారికి అందజేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ఆచంటలో త్వరలో ఫైర్ స్టేషన్

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గ ప్రజలకు అతి త్వరలో ఫైర్ స్టేషన్ కల సాకారం కాబోతుందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు 18 సెంట్లు స్థల సేకరణ పంచాయతీ తీర్మానం చేసి, 15 ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూ.3 కోట్ల మంజూరు గ్రాంటును తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో జిల్లా ఫైర్ అధికారి జి.శ్రీనివాస్‌కు ఎంఎల్ఎ చెరుకువాడ అందజేశారు. త్వరలోనే ఫైర్‌స్టేషన్ ఏర్పాటు పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, నేతలు కుక్కల కిరణ్, వేమన అప్పారావు, నల్లూరి చందు, దొమ్మేటి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి జివిఎన్ఎల్.నరసింహారావు (నాగబాబు) పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

లబ్ధిదారులకు విరివిగా రుణాలు మంజూరు చేసి సంక్షేమం, అభివృద్ధి అమలులో బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో బ్యాంకర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో, అభివృద్ధిలో బ్యాంకర్ల సహకారం ఎంతైనా అవసరమన్నారు. ఈ దిశగా పని చేసినప్పుడే ప్రగతి కన్పిస్తుందన్నారు. వివిధ పథకాల రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి డిసెంబర్ నెలాఖరు నాటికి అన్ని రుణాలను మంజూరు చేయాలని కోరారు. పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని రాష్ట్రంలో జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, జిల్లాను ఇతర జిల్లాలు ఆదర్శంగా తీసుకునేలా బ్యాంకర్లు రుణాల మంజూరులో చొరవ చూపాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 20,816 దరఖాస్తులను స్వీకరించామని, 2,780 దరఖాస్తులను ఆమోదించామని తెలిపారు. జిల్లాలో 89 వేల కౌలురైతు రుణార్హత కార్డులను జారీ చేశామని, వాటిలో 40 వేల సిసిఆర్‌సి కార్డుదారులకు ఖరీఫ్‌లో రూ.297 కోట్ల రుణాలను మంజూరు చేశారన్నారు. రానున్న రబీలో కూడా ఇదే విధంగా కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. చిన్న, మధ్యతరగతి రైతులు 16 వేల మంది రూ.12.50 కోట్ల సున్నా వడ్డీ పంట రుణాలను పొందారని, తిరిగి చెల్లించిన వారికి పెద్ద మొత్తంలో రుణాలను మంజూరు చేయాలని కోరారు. జగనన్న తోడు రుణాలను రూ.10 వేల నుండి రూ.13 వేల వరకు పెంచి మంజూరు చేయాలన్నారు. పశుకిసాన్ కార్డులను మంజూరు చేసి పాడి రైతులకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను మంజూరు చేయాలన్నారు. అమూల్‌కు పాలును అందించే రైతులకు రుణాలను మంజూరు చేసి ప్రోత్సహించాలన్నారు. ఆర్‌బిఐ ఎజిఎం ఆర్‌కె.హనుమకుమారి మాట్లాడుతూ రుణాల మంజూరులో, బకాయిలను తిరిగి రాబట్టడంలో బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు కూడా బకాయిలను చెల్లించేలా లబ్ధిదారులను ప్రోత్సహించి బ్యాంకర్లకు సహకారం అందించాలని కోరారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ పి.సంగీతకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు రుణాల మంజూరు విషయంలో అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ రుణాల మంజూరు సకాలంలో జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, నాబార్డు డిడి టి.అనిల్‌కాంత్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, మెప్మా ఇన్‌ఛార్జి పీడీ గ్రంధి పార్వతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఒ కృష్ణవేణి


బిజెపి విధానాలను తిప్పికొట్టాలి

ధర్నాను విజయవంతం చేయాలి - సంయుక్త కిసాన్‌మోర్చా కన్వీనర్ హరేరాం


మాట్లాడుతున్న ఆకుల హరేరామ్

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విధానాలను తిప్పికొట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ ఆకుల హరేరాం పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరాం మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్లో జరిగే మహాధర్నాలో రైతులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నట్లు నటించి మోడీ మళ్లీ వాటిని ప్రవేశ పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా 18 నెలల నుండి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, తెలుగురైతు సంఘం జిల్లా నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, సిఐటియు నాయకులు ఎం.రామాంజనేయులు, వాసుదేవరావు పాల్గొన్నారు.


సతీష్‌ను సత్కరిస్తున్న ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నిశాంత్ వర్మ

గణితంలో ఎస్ఆర్‌కెఆర్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్‌లో పరిశోధన చేసిన ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల మ్యాథమెటిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.సతీష్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ ప్రొఫెసర్ సతీష్‌ను యాజమాన్యం తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ గుంటూరు డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మధుసూదన్‌రావు పర్యవేక్షణలో 'ఫుజ్జీ సాఫ్ట్ టేరినరీ గమ్మ సిమి రింగ్స్' అనే అంశంపై పరిశోధన జరిపి పిహెచ్‌డి పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో అధ్యాపకులు కూడా ఎప్పటికప్పుడు తమ విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకుంటూ, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ అండ్ హ్యూమానిటీస్ హెడ్ డాక్టర్ డి.వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ ప్రయోజనాలను వినియోగించుకోవాలి

నరసాపురంలో ఫిష్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కోరారు. తీరప్రాంత మత్స్యకారులు మత్స్య సంపద అమ్మకాలు జరుపుకునేందుకు అధునాతన ఫిష్ మార్కెట్‌ను బుధవారం స్థానిక 11వ వార్డులో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల వ్యాపార అభివృద్ధికి ఫిష్ మార్కెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తాజా, నాణ్యమైన చేపలను అందించి వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు. ఎంఎల్ఎ ముదునూరి. ప్రసాదరాజు మాట్లాడుతూ పట్టణ, మండల, గ్రామ ప్రజలకు మంచి నాణ్యమైన సముద్ర ఉత్పత్తులను అందించి మంచి సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను మత్స్యకారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, రాష్ట్ర ప్రభుత్వ అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఛైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


చేపల మార్కెట్ ప్రారంభించిన మంత్రి అప్పల రాజు



కాలనీని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

జగనన్న కాలనీని ముంచెత్తిన చెరువుల నీరు

పట్టించుకోని అధికారులు
మోగల్లు కాలనీ పరిశీలించిన సిపిఎం బృందం
సమస్యలు ఏకరువు పెట్టిన కాలనీవాసులు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆక్వా చెరువుల నీటిని ఇష్టానుసారంగా వదిలేయడంతో మోగల్లు జగనన్న కాలనీ నీట మునిగిందని సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య ఆరోపించారు. అధికారులు నిర్లక్ష్యంగా పట్టీపట్లనట్లు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. కాలనీవాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మోగల్లులో ఆక్వా చెరువుల వల్ల ముంపునకు గురవుతున్న జగనన్న కాలనీలో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను బృందం ఎదుట ఏకరువు పెట్టారు. అనంతరం కాలనీవాసులతో కలిసి నేతలు పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి వెంకటరాజుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో వేగవంతంగా ఇల్లు నిర్మించుకోవాలని ఒత్తిడి చేసే అధికారులు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. మోగల్లులో నిబంధనలకు విరుద్ధంగా కనీస అనుమతులు లేకుండా ఆక్వా చెరువులు తవ్వారని ఆరోపించారు. జగనన్న కాలనీకి ఆనుకుని అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వడం దారుణమన్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా మండల, జిల్లా అధికారులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. జగనన్న కాలనీలో నడవడానికి వీల్లేకుండా నీళ్లొచ్చేశాయన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించాలన్నారు. తక్షణం సీసీ రోడ్లు, పక్కా డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులను నిలుపుదల చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలా వెంకటస్వామి, వీరవల్లి వెంకటేశ్వరరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

రూ.2500 కోట్లతో రోడ్ల నిర్మాణం

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ వెల్లడి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.2500 కోట్లు కేటాయించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. పట్టణంలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సుమారు వంద కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. చిలకంపాడు లాకుల నుంచి వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ వరకు కెఎన్ రోడ్డును రూ.45 కోట్లతో నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. బాదంపూడి నుంచి ప్రత్తిపాడు జంక్షన్ వరకు రూ.10 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టబోతున్నట్లు చెప్పారు. ప్రతిపాడు నుంచి నవాబుపాలెం బ్రిడ్జి వరకు మూడున్నర కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కె.పెంటపాడు నుంచి పడమర విప్పర్రు వరకు రూ.10 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టామని, ఇందులో మూడు కోట్ల రూపాయలతో పడమర విప్పర్రు గ్రామ పరిధి మొత్తం సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. వన్‌టౌన్‌లోని మెయిన్ రోడ్డుపై బిటి హాట్‌మిక్స్‌తో మరొక పొర వేయనున్నట్లు వివరించారు. పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ సుమారు రూ.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. 33, 34 వార్డుల్లో సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షులు గుండుబోగుల నాగు, జెసిఎస్ కన్వీనర్లు కర్రి భాస్కర్‌రావు, కొలుకులూరి ధర్మరాజు, యూత్ లీడర్ కొట్టు విశాల్, టౌన్ మహిళా ప్రెసిడెంట్ బోనం విజయనిర్మల, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొద్దు సాయి బాబా పాల్గొన్నారు.

నేడు నెలమూరులో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 23వ తేదీన నెలమూరులో లేగ దూడల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆలమూరు వెటర్నరీ వైద్యుడు జి.రవికాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బికె భవనం వద్ద ఆరు నెలల్లోపు లేగ దూడలను పాడి రైతులు ప్రదర్శనలో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి గొట్టుముక్కల మంగతాయారు, ఎంపిటిసి లక్ష్మి, భీమవరం పశువైద్య శాఖ అధికారి ఏసురత్నం, మార్టేరు పశువైద్య అధికారి ప్రసాద్‌తో పాటు పలువురు టెక్నీషియన్స్ పాల్గొంటారని తెలిపారు. పాడి రైతులు లేగ దూడలతో పోటీలో పాల్గొనాలని తెలిపారు.

27 నుంచి సామాజిక ఆర్థిక సర్వే

వీరవాసరం:ఈ నెల 27 నుంచి చేపట్టనున్న సామాజిక ఆర్థిక సర్వేకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని నోడల్ అధికారి, సోషల్ వెల్ఫేర్ జెడి.శోభారాణి కోరారు. కులగణనపై అవగాహన సదస్సు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జ్యోతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొనున్న సర్వేలో ఐరీస్, వేలిముద్ర, ఫేషియల్ ద్వారా కుటుంబాల్లోని వ్యక్తులను గుర్తించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలకు, లబ్ధిదారులకు ఈ సర్వే వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. సర్వేలో ఎవరికీ ఇబ్బందిలేకుండా వారు చెప్పిన వివరాలను సర్వే సిబ్బంది నమోదు చేసుకోవాలే తప్ప వారిపై ఎటువంటి ఒత్తిడీ చేయకూడదన్నారు. తహాశీల్దార్ సుందరరాజు మాట్లాడుతూ ప్రజలకు బాధ కలిగించకుండా వివరాలు తెలుసుకోవాలన్నారు. ప్రతి కుటుంబాన్నీ సర్వేలో భాగస్వామ్యం చేసి పూర్తి చేయాలని ఎంపిడిఒ జ్యోతి కోరారు. ఈ సదస్సులో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎస్ఐ నాగమణి పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాల ఘనత జగన్‌దే'

ప్రజాశక్తి - ఆచంట

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని ఆచంట వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి అన్నారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా ఆచంట వేమవరం గ్రామ సచివాలయం వద్ద సర్పంచి చంటి అధ్యక్షతన మా నమ్మకం నువ్వే జగన్ డిజిటల్ బోర్డు ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జగన్మోహన్ రెడ్డి మంచి గుర్తింపు పొందారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కొండేటి సురేష్‌బాబు, రాష్ట్ర వివర్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అందే నాగ బసవన్న, ఎఎంసి డైరెక్టర్ గెద్దాడ వరలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : భట్లమగుటూరులో 'జగన్ ఎందుకు రావాలి' కార్యక్రమం వైసిపి గ్రామ అధ్యక్షుడు ఈది ఏకోబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల సమాచార బోర్డును సర్పంచి బయ్యే సుగుణమ్మ ఆవిష్కరించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), మండల మహిళా అధ్యక్షురాలు కర్రి అనురాధ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), రెండో వైస్ ఎంపిపి ఈది అనిత, వైసిపి మండల కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు విజయభేరి

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడలోని మారీస్ స్టెల్లా కళాశాలలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ అండర్ -14, అండర్ -19 బాల బాలికల పోటీల్లో జిల్లా విజయభేరి మోగించింది. అండర్ - 14 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, అండర్-14 బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, అండర్-19 బాలుర విభాగంలో తృతీయ స్థానం, అండర్-19 బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు జై.రాజ్, రాజేందర్, మల్లేశ్వరరావు తెలిపారు. ఈ జట్లకు కోచ్ మేనేజర్లుగా పి.దావూద్‌ఖాన్, ఎన్.విజయలక్ష్మి, పి.శ్రీనివాసు, విజయ్‌కుమార్ వ్యవహరించారు. విజయం సాధించిన నెట్ బాల్ జట్టును, కోచ్ మేనేజర్లను పలువురు అభినందించారు.

జువ్వలపాలెం మాజీ సర్పంచి బలరామరాజు మృతి

ప్రజాశక్తి - కాళ్ల



జువ్వలపాలెం మాజీ సర్పంచి గోకరాజు బలరామరాజు (90) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య ఉన్నారు. ఆయన జువ్వలపాలెం గ్రామ సర్పంచిగా 18 ఏళ్ల పాటు గ్రామాభివృద్ధికి విశేష సేవలందించారు. సిబిసిఎన్‌సి చర్చి నిర్మాణానికి రెండెకరాల భూమిని విరాళంగా అందజేశారు. క్రిస్టియన్ పేటలో గోకరాజు బలరామరాజు పేరుతో గోకరాజు బలరామరాజు నగర్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మృతి పట్ల ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు రంగరాజు, గోకరాజు రామరాజు, సర్పంచి మీసాల రమణ, ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతి రాజు, ఎంపిటిసి మీసాల శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యుడు గుట్టం జార్జి బెనహర్, మాజీ సర్పంచి గోకరాజు పెదబాబు, మాజీ ఉపసర్పంచి గోకరాజు వినోద్ రంగరాజు, రుద్రరాజు వెంకట రామకృష్ణంరాజు తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - పాలకొల్లు

నేరాలు - ఘోరాలు

పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న చిట్టూరి భారతి మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని భావిస్తున్నారు. ఆమె పెదగోపురం సమీపంలోని ఓ రెడీమేడ్ దుకాణంలో పని చేస్తోంది. ఆమెకు తల్లి, ఇద్దరు అక్కలు ఉన్నారు. తండ్రి లేరు. వారం రోజులుగా భారతి వివాహ విషయమై తల్లికి ఆమెకు ఘర్షణ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారతి మంగళవారం మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ ముత్యాలరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని బుధవారం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

బాలిక ఆత్మహత్య

యలమంచిలి:మండలంలోని కాజాతూర్పు గ్రామంలో ఉరి వేసుకుని బాలిక మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం మండలం చింతల మోరి గ్రామానికి చెందిన దొడ్డా శ్రీనివాసరావు, షారోన్ పుష్ప దంపతుల కుమార్తె దొడ్డా నాగ శివాని (15). ఆమె గత మార్చి నెలలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో స్వగ్రామం చింతలమోరీ గ్రామంలోనే ఇంటి వద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లా కత్తిమండ గ్రామానికి చెందిన యువకుడు కొప్పాడి అయ్యప్ప నాగశివానిని కిడ్నాప్ చేసిన నేపథ్యంలో అతనిపై మల్కిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో నాగశివానిని చింతలమోరీలో ఉంచడం శ్రేయస్కరం కాదని ఆ బాలికను యలమంచిలి మండలం కాజతూర్పు గ్రామంలో బాలిక అమ్మమ్మ తాతయ్య వద్ద ఉంచారు. అయితే బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగశివాని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు, ఆమె మృతికి ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చని పలువురు చెబుతున్నారు. నాగ శివాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని యలమంచిలి ఎస్ఐ జెఎన్‌వి.ప్రసాద్ తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన ఘటన యండగండి గ్రామంలో చోటుచేసుకుంది. ఆకివీడు సిఐ కె.సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. యండగండి గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన పురేళ్ల సోమరాజు ప్రేమ పేరుతో మోసం చేసి అత్యాచారం చేశాడని బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమరాజుపై పోక్సో కేసు, అత్యాచార కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు దిశా డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్ పర్యవేక్షణలో జరుగుతుందని సిఐ సత్యనారాయణ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి విజయవాడ కోర్టులో హాజరు పరిచినట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పిఎస్ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. రాజమండ్రి రైల్వే డిఎస్‌పి బివిఎస్.నాగేశ్వరరావు ఉత్తర్వుల మేరకు భీమవరం రైల్వే లైన్ సిఐ ఎస్.శంకరరావు ఆదేశాల మేరకు సిబ్బంది రైళ్లలో దొంగ తనాలకు పాల్పడుతున్న కాకినాడకు చెందిన అనంత దుర్గారావు, తండ్రి శ్రీను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3,50,000 విలువ చేసే 8 లాప్‌టాప్‌లు, బ్లాక్ కలర్ హోండా షైన్ మోటార్ వెహికల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుల వృత్తి చేసుకుంటూ ఉన్నతస్థాయికి..



జువ్వలపాలెంలో అన్ని హంగులతో ఏర్పాటు చేసిన హెయిర్ సెలూన్

ప్రజాశక్తి - కాళ్ల

మనిషి తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. ఎంచుకున్న రంగంలో కృషి, పట్టుదలతో పనిచేస్తే తప్పక ఉన్నతి స్థితికి చేరుకోవచ్చు. దీనికి నిజమైన ఉదాహరణగా నిలిచాడు సూదికొండ నాగేశ్వరరావు. ఆయన జువ్వలపాలెంలో ఏర్పాటు చేసిన బార్బర్ షాప్‌నకు ఆదరణ పెరిగింది. నాగేశ్వరరావు ఏలూరుపాడులో ఓ సాధారణ కుటుంబంలో జన్మించారు. నాగేశ్వరరావు తండ్రి కుల వృత్తి అయిన క్షౌర వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి తన కుటుంబాన్ని పోషించడానికి నాగేశ్వరరావు రేయింబవళ్లు



సెలూన్‌లో కటింగ్ చేస్తున్న సూదికొండ నాగేశ్వరరావు

ఆదర్శంగా నిలిచిన నాగేశ్వరరావు

కష్టపడ్డాడు. ఈ వృత్తిలో నైపుణ్యం సాధించి చిన్న కటింగ్ షాపు స్థాయి నుంచి ప్రస్తుతం స్టైలిష్ హెయిర్ సెలూన్ స్థాయికి తీసుకెళ్లాడు. ఒకప్పుడు ఏలూరుపాడులో చెట్టు కింద దుకాణం పెట్టి కటింగ్ చేసిన నాగేశ్వరరావు ప్రస్తుతం అన్ని హంగులతో స్టైలిష్ సెలూన్ షాపుగా మార్చాడు. యువత మెచ్చే ఆధునిక కటింగ్‌లు చేసి ఆదరణ పొందుతున్నాడు.

ఆర్థికంగా మంచి స్థాయిలో ఉన్నా అన్నం పెట్టిన కులవృత్తిని నాగేశ్వరరావు ఇప్పటికీ వదల్లేదు. బార్బర్ షాపును నిర్వహిస్తున్నాడు. కేశాలంకరణ అనేది వ్యక్తి అందాన్ని మరింత పెంచేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. అయితే నాగేశ్వరరావు వివిధ మోడళ్లలో హెయిర్ కటింగ్ చేయడం వల్ల ఆయన దగ్గరకు చిన్న పిల్లల నుంచి పెద్దలు, యువత ఎక్కువగా వస్తుంటారు.

అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేశాను

సూదికొండ నాగేశ్వరరావు, బార్బర్ షాప్ యజమాని, జువ్వలపాలెం



జుట్టు కత్తిరించడం, హెయిర్ కలరింగ్, బాడీ మసాజ్ మిషన్, హెడ్ మసాజ్, కాళ్ల వాష్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఇక్కడకు కటింగ్ చేసుకోవడానికి వస్తుంటారు. కటింగ్‌ల్లో చాలా రకాలు నేర్చుకున్నాను. ఈ వృత్తి చేసుకుంటూ ఈ స్థాయికి వచ్చాను.

స్వర్ణాంధ్రతో మూడు ఒప్పందాలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

స్వర్ణంధ్ర కళాశాలలో సిఎస్‌సి అకాడమీ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ భారత ప్రభుత్వం వారు మూడు రకాల ఒప్పందాలు చేసుకున్నాయని స్వర్ణంధ్ర ఇంజినీర్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ తెలిపారు. సి డిఎసి, ఐఇఇఇ సహకారంతో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీలో ఆధునిక అభివృద్ధీకరణ గురించి వివిధ కోర్సులను ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉచితంగా బోధించడం జరుగుతుందన్నారు. అలాగే స్వర్ణాంధ్ర విద్యార్థులందరికీ ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ప్లాట్ఫారం ద్వారా అత్యాధునిక కంప్యూటర్ కోర్సులు, ఎలక్ట్రానిక్ కోర్సులు, జాబు ఓరియెంటెడ్ కోర్సులు నేర్పనున్నట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన ఒప్పందాల వల్ల విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కళాశాల ట్రెజరర్ కెవి.స్వామి, అడ్డాల శ్రీహరి మాట్లాడారు.



బాధితులకు సాయం అందజేస్తున్న కొవ్వలి ఫౌండేషన్ సభ్యులు

బాధితులకు కొవ్వలి ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం మిషన్ హైస్కూల్ రోడ్డులోని శ్రీనివాస కూల్ డ్రింక్స్ షాప్‌లో అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో షాప్ మొత్తం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ సంఘటన స్థలానికి చేరుకుని షాపు యజమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు ఆదేశాల మేరకు బాధితుడు చించినాడ శ్రీనివాసుకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని సంస్థ ట్రెజరర్ కొవ్వలి జయలక్ష్మి, నిమ్మకాయల రస్మిత అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పేరుతో దోపిడీ : పితాని

ప్రజాశక్తి - ఆచంట

ఇళ్ల స్థలాల పేరుతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైసిపి నేతలు లబ్ధిదారుల నుంచి సొమ్ములు పెద్ద ఎత్తున దోచేశారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. బుధవారం స్థానిక రామేశ్వరస్వామి కళావేదిక వద్ద టిడిపి, జనసేన ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ వైసిపి నేతలు ఈ దోపిడీ నిజం కాదని చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. గ్రామాల్లో చర్చ వేదికలు ఏర్పాటు చేస్తే వారు చేసిన దోపిడీని బహిరంగంగానే నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు రౌడీ రాజుగా వ్యవహరిస్తున్నారన్నారు. మండలంలో ఆచంట, కొడమంచిలి గ్రామ సర్పంచులు పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారని, వారికి ఎంఎల్ఎ రంగనాథరాజు అండగా ఉంటూ అవినీతిని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వైసిపి నాయకులు చేస్తున్న అవినీతిని ప్రశ్నించడానికి టిడిపి, జనసేన నాయకులు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, టిడిపి మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, నేతలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యార్థుల సమస్య పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు పి.వాసు అధ్యక్షతన బుధవారం ఎప్ఎంబిటిఎవి అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ సభ్యత్వాల సంఖ్య పెంచుతూ ప్రాథమిక కమిటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను చైతన్యవంతులను చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విద్యాశాఖాధికారులు విఫలమయ్యారన్నారు. ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర, ఈశ్వర్ పాల్గొన్నారు.

కెపిపాలెంలో వన సమారాధన

మొగల్తూరు:శెట్టిబలిజి సంఘం సభ్యులందరూ ఒక్క తాటిపై ఉండి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంఘం నాయకులు సభ్యులకు సూచించారు. కెపిపాలెం బీచ్‌లో ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో శెట్టిబలిజి నరసాపురం నియోజకవర్గ స్థాయిలో బుధవారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌సి, శెట్టిబలిజ తెలుగు నాడు ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణ, సంఘం తణకు నియోజకవర్గ కన్వీనర్ దొమ్మేటి వెంకట సుధాకర్ పాల్గొన్నారు.

126 రకం వంగడాన్ని కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

రైతుల సమస్యలు పరిష్కరించాలని, 126 వరి వంగడాన్ని కొనసాగించాలని కోరుతూ స్థానిక తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు నాయకులు సత్తి కోదండరామిరెడ్డి, తేతల నాగిరెడ్డి మాట్లాడారు. మన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎన్నో ప్రయోగాలు చేసి అధిక దిగుబడులు సాధించే వంగడాలను సృష్టించారని తెలిపారు. ఈ వంగడాల వల్ల ఆహార కొరత లేకుండా



నిరసన తెలుపుతున్న నేతలు, రైతులు

మన దేశ అవసరాలతో పాటుగా ఇతర దేశాలకు కూడా ఆహార ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. ఈ మధ్యకాలంలో పిఆర్ 126 రకం వంగడాన్ని శాస్త్రవేత్తలు రైతులకు అందించారని, ఇది మంచి దిగుబడి కలిగిన వంగడం అని తెలిపారు. ఈ వంగడాన్ని వేయొద్దని ప్రభుత్వం రైతులకు చెప్పడంతో వారు నిరాశకు గురవుతున్నారని తెలిపారు. 126 రకం వంగడాన్ని రద్దు చేయడం వల్ల పంట దిగుబడి తగ్గిపోతుందని, దీన్ని ప్రభుత్వం కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, కడప ఆంజనేయులు, కర్రి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్వా యూనివర్శిటీ విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

తీరప్రాంత అభివృద్ధికి సిఎం జగన్ ప్రత్యేక దృష్టి

మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తిరుమాని నాగరాజు ప్రమాణస్వీకారం

నరసాపురం ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఆక్వా యూనివర్సిటీలో ప్రవేశాలకు ఎంపికైన మొదటి సంవత్సరం విద్యార్థులు 60 మందికి బుధవారం మత్స్యశాఖా మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని కాటన్ పార్కులో బుధవారం నిర్వహించిన సభలో ఈ పత్రాలు మంత్రి అప్పలరాజు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన తిరుమాని నాగరాజుచే బిసి కార్పొరేషన్ సంక్షేమ అధికారి ఎన్.పుష్పలత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఆక్వా యూనివర్సిటీ ఓఎస్‌డి డాక్టర్ ఓగిరాల సుధాకర్, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఆక్వా యూనివర్సిటీ సిఒఇ డాక్టర్ టి వి రమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్ ప్రసాదు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలు రహదారులపై తిరగాలంటే నరకయాతన పడుతున్నారని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి న్యాయకర్ అన్నారు. బుధవారం మోడీ గ్రామంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ రోడ్డు గుండా వెళ్లిన పలువురు వాహనదారులు అనారోగ్యానికి గురై హాస్పిటల్ పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రహదారులను అభివృద్ధి చేయాలని సూచించారు. మోడీ - మొగల్తూరు గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సిరిగినీడి రాజ్యలక్ష్మి, మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, సర్పంచులు మేడిది సౌజన్య, పులపర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్, రిటర్నింగ్ అధికారి బి.వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాలలో స్వీప్‌లో భాగంగా ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారా చుట్టూ ఉన్న సామాజాన్ని మార్చవచ్చన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహాశీల్దార్ పిఎన్‌డి ప్రసాద్ మాట్లాడుతూ ఓటు నమోదులో యువతీ, యువకుల సంఖ్యను గణనీయంగా పెంచడం ఈ స్వీప్ ప్రోగ్రామ్ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది కి పైగా విద్యార్థినులు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వై.శ్రీనివాస్, ఎలక్షన్ డిప్యూటీ తహాశీల్దార్ సూర్య నారాయణరాజు పాల్గొన్నారు.

అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు : పివిఎల్

పాలకోడేరు:అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు నాయుడు అని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరులో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచి గొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు)తో కలిసి పివిఎల్ ఆవిష్కరించి వైసిపి జెండా ఎగరవేసి మాట్లాడారు. గత ప్రభుత్వానికి వైసిపి ప్రభుత్వానికి తేడా గమనించి ప్రజలు ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉండి ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి నాగరాజు, ఎంపిటిసిలు బోళ్లం గాంధీ పాల్గొన్నారు. పెన్నాడ అగ్రహారం పంచాయతీ పరిధిలోని పెన్నాడపాలెంలో అంతర్గత పైప్ లైన్ నిర్మాణానికి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు శంకుస్థాపన చేసి మాట్లాడారు.